ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3



విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 20 జూన్ 2024

హోం మంత్రి అనిత బాధ్యతల స్వీకరణ

హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వంగలపూడి అనిత



మెయిన్‌లో..

అటకెక్కిన గస్తీ, భయం నీడన బస్తీ!!

నగరంలో రాత్రిపూట పెరుగుతున్న దాడులు

- ఒంటరిగా వెళుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ఆకతాయిలు




- ప్రతిఘటించేందుకు యత్నిస్తే మూకుమ్మడిగా దాడి
- వరుస ఘటనలతో బెంబేలెత్తిపోతున్న నగరవాసులు
- పట్టించుకోని పోలీసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర నడిబొడ్డునున్న వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్కు వద్ద మంగళవారం రాత్రి పది గంటల సమయంలో వాకింగ్ చేస్తున్న ఒక వ్యక్తిని ఇద్దరు యువకులు అటకాయించారు. అతను గట్టిగా కేకలు వేసేసరికి ముఖంపై పిడిగుద్దులు గుద్ది పరారైపోయారు.

ఈనెల 17వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రామ్‌నగర్‌లోని తన ఇంటికి నడిచి వెళుతున్న మహిళను బైక్‌పై ఇద్దరు యువకులు వెంబడించి ఆమె చేతిలోని బ్యాగ్‌ను తెంచుకుని పరారైపోయారు.

అక్కయ్యపాలెంలోని ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి ఈనెల 13న రాత్రి ఒంటి గంట సమయంలో విధులు ముగించుకుని మధురవాడలోని తన ఇంటికి బైక్‌పై వెళుతుండగా ఇద్దరు యువకులు బైక్‌పై వెంబడించి ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆయన చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొనే ప్రయత్నం చేశారు.



సెంట్రల్‌పార్కు వద్ద మంగళవారం రాత్రి వాకర్‌పై దాడి జరిగింది ఈ ప్రాంతంలోనే..

...నగరంలో రాత్రిపూట జరుగుతున్న దాడులు, చోరీలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. కొద్దిరోజులుగా రాత్రిపూట ఒంటరిగా వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలు, దాడులు, స్నాచింగ్‌లు పెరిగిపోయాయి. రాత్రిపూట పోలీసుల గస్తీ బలహీనమైపోవడంతోపాటు వీధి దీపాలు వెలగపోవడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం దీనికి ప్రధాన కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలో చోరీలు నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ రాత్రి బీట్‌లు నిర్వహిస్తుంటారు. ఒక కానిస్టేబుల్/హెడ్‌కానిస్టేబుల్‌తోపాటు ఏఎస్ఐ/హోంగార్డును ఒక బీట్‌గా పరిగణిస్తారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ రాత్రిపూట నేరాలు జరుగుతున్న ప్రాంతాలతోపాటు అందుకు ఆస్కార ఉన్న ప్రాంతాలను గుర్తించి బీట్ రూట్‌లలో చేరుస్తారు. ఒక్కో బీట్ సిబ్బందికి ఒక్కో రూట్‌ను కేటాయిస్తారు. రాత్రి పది నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకూ తమకు కేటాయించిన రూట్‌లో గస్తీ నిర్వహించడంతోపాటు నిర్దేశిత పాయింట్‌లలో ఉంచిన బీట్ బుక్‌లో సంతకాలు చేయాల్సి ఉంటుంది. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 120 బీట్‌లు వరకూ నడిచేవి. కానీ ఎన్నికల హడావిడి మొదలైనప్పటి నుంచి రాత్రి గస్తీపై అధికారులు ... మిగతా 4వ పేజీలో

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

డైట్ చార్ట్ పాటించని కేజీహెచ్ కాంట్రాక్టర్

- ప్రతి రోజూ టిఫిన్‌గా జావ లాంటి ఉప్మాయే
- భోజనం రుచి కూడా అంతంత మాత్రమే
- వైసీపీ నేత మనుషులకు కాంట్రాక్టు
- నాణ్యతపై ఫిర్యాదులు ఉన్నా పట్టించుకోని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ప్రజలకు పెద్ద దిక్కు అయిన కింగ్‌జార్జి ఆస్పత్రిలో రోగుల ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి పౌష్టికాహారం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు ఇస్తున్నాయి. వాటిని కాజేయడానికి రాయలసీమ వైసీపీ నేతలు విశాఖలో పాగా వేశారు. ఆ పార్టీ పేరు 'చెవి'న పడగానే ఎటువంటి కాంట్రాక్ట్ అయినా సంతకం చేసేసే అధికారి...దీనిని కూడా అలాగే ఇచ్చేశారు. దాంతో రోగులకు సరైన ఆహారం అందడం లేదు.



రోగులకు అల్పాహారం వడ్డిస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్‌లో) ప్లేటులో పలచగా దోసె మాదిరిగా ఉప్మా

కింగ్ జార్జి ఆస్పత్రిలో రోజుకు 1,600 నుంచి 1,800 రోగులకు ఉదయం అల్పాహారం, రెండు పూటలా భోజనం అందిస్తారు. డాక్టర్లు, పీజీలకు కూడా ఇక్కడే మధ్యాహ్నం భోజనం పెడతారు. వీరు 200 మంది వరకు ఉంటారు. అంటే కేజీహెచ్‌లో రోజుకు రెండు వేల మందికి ఆహారం పెడతారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనంలో ఏమి పెట్టాలనేది వైద్యాధికారులు ఒక చార్ట్ (మెనూ) తయారుచేశారు. ఆ ప్రకారం ఏ రోజుకు ఆరోజు ఆహారం మారుస్తూ పెట్టాలి. సాధారణ వార్డులో ఉన్న ఒక్కో రోగికి ఆహారం నిమిత్తం ప్రభుత్వం రోజుకు రూ.80 ఇస్తోంది. అదే మహిళలు ఉండే వార్డు (గర్భిణులు, పురుడు పోసుకున్న తల్లులు)లకైతే రోజుకు రూ.100 ఇస్తారు. జననీ శిశు సురక్ష పథకం కింద ఈ నిధులు వస్తాయి. రోజుకు సుమారు రూ.2 లక్షల బిల్లు, నెలకు రూ.60 లక్షలు, ఏడాదికి రూ.7.2 కోట్ల బిల్లు వచ్చే కాంట్రాక్టు కావడంతో చిత్తూరు జిల్లాకు చెందిన వైసీపీ నేత కన్ను పడింది. కలెక్టరేట్‌లో కాలు పెట్టారు. ఉన్నతాధికారి సంతకం చేయడంతో రెండేళ్లకు డైట్ కాంట్రాక్టు దక్కించుకున్నారు. దానిని నలుగురు అనుచరులకు పంచిపెట్టారు. ఆరు నెలలకు ఒకరు చొప్పున డైట్ కాంట్రాక్ట్ తీసుకొని ఆహారం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నైకు చెందిన ఒక వ్యక్తి డైట్ అందిస్తున్నారు. ఇందులో భారీగా లాభం కళ్ల చూడాలనే ఆశతో రోగులకు సరైన ఆహారం అందించడం లేదు. వారికి ఏది తయారుచేయడం సులువో చూసుకొని అది మాత్రమే పెడుతున్నారు. ఈ కాంట్రాక్టు వెనుక ఎవరు ఉన్నారో అందరికీ తెలిసిన విషయమే కావడంతో కేజీహెచ్ పరిపాలనా అధికారులు పట్టించుకోవడం లేదు. కడుపు మండి ఎవరైనా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే...అది బుట్టదాఖలు అవుతున్నదే తప్ప చర్యలు ఉండడం లేదు.

ప్లేటులో వేస్తే చెదిరిపోయే ఉప్మా

రోగులకు ప్రతిరోజూ ఉదయం టిఫిన్ కింద ఇడ్లీ/ఉప్మా/కిచిడీ/బ్రెడ్‌లలో ఏదో ఒకటి, పాలు, గుడ్డు ఇవ్వాలి. అయితే ఇడ్లీలు తయారుచేసే యంత్రం పాడైపోయిందని అవి పెట్టడం మానేశారు. పోనీ ఆ స్థానంలో మంచి టిఫిన్ ఏదైనా ఇస్తున్నారా?...అంటే అదీ లేదు. గత పది రోజులుగా టిఫిన్ ప్లేటులో ఉప్మాయే పోస్తున్నారు. గరిటెతో తీసి ప్లేటులో వేయగానే అది ప్లేటు అంతా సాంబారులా పరుచుకుపోతోంది. దానిని ఉప్మా అంటారో...లేదా కొత్తగా ఏమైనా పేరు పెట్టాలో అర్థం కాదు. కిచిడీ కూడా ఇవ్వడం లేదు. ప్రతి ఆహారం ఎంత బరువుతో ... మిగతా 4వ పేజీలో

ఆస్తి పన్ను చెల్లింపునకు తంటాలు

వార్డు సచివాలయాల్లో పనిచేయని సీడీఎంఏ వెబ్‌సైట్

- మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెల్లింపునకు ఈ నెలాఖరు వరకూ గడువు
- ఆ తరువాత నెలకు నూటికి రూ.2 వడ్డీ విధింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



నగరంలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సీడీఎంఏ వెబ్‌సైట్ చుక్కలు చూపిస్తోంది. వార్డు సచివాలయాల్లో పన్ను చెల్లించేందుకు వెళ్లిన వారికి సర్వర్ డౌన్ అంటూ అక్కడి సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో వారంతా చేసేదేమీలేక వెనుతిరిగి వెళ్లిపోతున్నారు.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం నివాస, నివాసేతర భవనాలతోపాటు ఖాళీ స్థలాలకు సంబంధించి 5,72,356 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.450 కోట్లు పన్ను వసూలవుతుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.456 కోట్లు వసూలైంది. సాధారణంగా ఆస్తి పన్నును రెండు విడతలుగా (అర్ధ సంవత్సరాలు) విభజించి యజమానుల నుంచి జీవీఎంసీ కట్టించుకుంటుంది. ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకూ మొదటి అర్ధ సంవత్సరంగానూ, అక్టోబర్ ఒకటి నుంచి మార్చి 31 వరకూ రెండో అర్ధసంవత్సరంగా పరిగణిస్తారు. మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును జూన్ 30వ తేదీలోగా చెల్లించేయాల్సి ఉంటుంది. అలాకానిపక్షంలో రూ.2 చొప్పున వడ్డీ అదనంగా చెల్లించాలి. దీంతో చాలామంది పన్ను చెల్లింపుదారులు జూన్‌నెలలోనే తమ మొదటి అర్ధసంవత్సరం పన్నును చెల్లిస్తుంటారు. ఆస్తి పన్ను చెల్లింపు కోసం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో 'సౌకర్యం' కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిల్లో పన్ను చెల్లిస్తే ఆ మొత్తం జీవీఎంసీ ఖజానాకు నేరుగా చేరిపోతుంది. ఇవికాకుండా జీవీఎంసీ పరిధిలోని 573 వార్డు సచివాలయాల్లో కూడా ఆస్తిపన్ను చెల్లించేందుకు గత రెండేళ్లుగా అవకాశం కల్పించారు. తమ ఇంటి సమీపంలోని వార్డు సచివాలయాల్లో ఎక్కువ మంది పన్ను చెల్లించేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే వార్డు సచివాలయాల్లో జీవీఎంసీ వెబ్‌సైట్‌లో కాకుండా ... మిగతా 4వ పేజీలో

బిచాణా ఎత్తేసిన కాంట్రాక్టర్లు!

జగనన్న కాలనీల్లో నిలిచిపోయిన పనులు

- వైసీపీ ఓటమితో తట్టాబుట్టా సర్దేశారు
- లోపాలు బయటపడతాయనే...
- మెజారిటీ లేఅవుట్‌లలో మిషనరీ తరలింపు
- గత ప్రభుత్వ హయాంలో అనధికారికంగా కేటాయింపు
- ఇప్పుడు ఎక్కడి పనులు అక్కడ వదిలేసి జంప్
- లబ్ధిదారుల సంగతేంటి?



ఆనందపురం మండలం గిడిజాలలో జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన అనధికార కాంట్రాక్టర్లు తట్టా బుట్టా సర్దేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తమ ఆటలు ఇక సాగవని భావించి లేఅవుట్‌లలో యంత్రాలను చాలావరకూ తీసుకుపోయారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పుడే నగర శివారు ప్రాంతాల్లోని 73 లేఅవుట్‌లలో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు... ఓట్ల లెక్కింపు తరువాత మిషనరీని తరలించుకుపోతున్నారు.

గత ప్రభుత్వంలో వైసీపీ ప్రజా ప్రతినిధులుగా ఉన్న ఇద్దరు ఎక్కువగా విశాఖ పరిసరాల్లో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. నెల్లూరు జిల్లా వైసీపీ మాజీ ఎమ్మెల్యేకు చెందిన జేఎస్ఆర్ గ్రూపునకు 40 వేల ఇళ్లు, అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి చెందిన రాక్‌ట్రీ ఇన్‌ఫ్రాకు 20 వేలు, ఇంకా వైసీపీ సానుభూతిపరులైన చిన్న కాంట్రాక్టర్లు, స్థానికంగా ఉండే కొందరు నిర్మాణదారులకు మరికొన్ని ఇళ్ల నిర్మించే బాధ్యతను అనధికారికంగా వైసీపీ ప్రభుత్వం అప్పగించింది. ఇళ్ల నిర్మాణంలో మూడో ఆప్షన్ ఇచ్చిన లబ్ధిదారుడు, బ్యాంకు, పనులు తీసుకున్న కాంట్రాక్టర్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర లేకపోయినా...అధికారం ఉంది కదా అని అస్మదీయులైన నిర్మాణ సంస్థలకు ఇళ్ల బాధ్యతలు అప్పగించింది. ఈ విధంగా నగర శివారుల్లో 73 లేఅవుట్‌లలో 1,09,216 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటిని కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన పథకం కింద మంజూరుచేసింది. ప్రాజెక్టు విలువ సుమారు రూ.2,000 కోట్లుగా అంచనా వేశారు. ఒక్కొక్క ఇంటికి రూ.1.8 లక్షలు కేంద్రం మంజూరుచేయగా, మహిళా లబ్ధిదారులు డ్వాక్రా రుణం కింద రూ.35 వేలు బ్యాంకు నుంచి తీసుకుని తమ వాటాగా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సిమెంట్, ఇసుక, ఇనుము సరఫరా చేసింది. సుమారు రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అనుకున్నంత వేగంగా జరగలేదు. ఇప్పటివరకూ 16,585 ఇళ్లకు శ్లాబు వేయగా, 3,850 ఇళ్లు శ్లాబు వరకూ వచ్చాయి. మరో 759 ఇళ్లు గోడల వరకూ అయ్యాయి. ఇంకా 27,953 ఇళ్లు పునాదులు వరకూ కాగా మరొక 29,456 ఇళ్లకు పునాదులు తవ్వారు. ఇంతవరకూ 19,426 ఇళ్ల పనులు ప్రారంభించనేలేదు. ఇప్పటివరకూ చేసిన పనులకు రూ.335 కోట్లు బిల్లులు కింద మంజూరుచేశారు. అయితే ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు ఎక్కడ పనులు అక్కడే విడిచిపెట్టేశారు. ప్రస్తుతం కాలనీలు నిర్మానుష్యంగా మారాయి. అక్కడక్కడా హౌసింగ్ అధికారులు నియమించిన కాపలాదారులు మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టర్లు తిరిగి పనులు కొనసాగించడం కష్టమేనని గృహ నిర్మాణ సంస్థ అధికారులు అంటున్నారు.



నిలిచిపోయిన బ్రిక్స్ తయారీ

ఇదిలావుండగా జగనన్న కాలనీల్లో ఇప్పటివరకూ చేపట్టిన నిర్మాణాలకు ఇచ్చిన రూ.335 కోట్ల చెల్లింపులకు సంబంధించి లెక్కలు సక్రమంగా ఉన్నాయా?, లేదా?...అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ప్రభుత్వం నుంచి కాకుండా లబ్ధిదారుల ఖాతాల నుంచి కాంట్రాక్టర్ల ఖాతాలకు బిల్లులు విడతల వారీగా జమ చేశారు. చేసిన పనులకు తగ్గట్టుగానే బిల్లులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నా...73 కాలనీల్లో పనులపై పర్యవేక్షణ చేయడంలో తొలి నుంచి అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో పాటు కాంట్రాక్టర్లను నిలదీసే ధైర్యం చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో వైసీపీ ఓటమిపాలు కావడంతో అప్రమత్తమైన కాంట్రాక్టర్లు తట్టా బుట్టా సర్దేశారు. అర్ధంతరంగా ఇళ్ల నిర్మాణాలు మధ్యలో వదిలేయడంలో లబ్ధిదారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. జగనన్న కాలనీలు మధ్యలో ఉండిపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే కొందరు అధికారులకు ఇబ్బందులు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



ఆనందపురం గ్రామ శివారున చెరువులో మట్టి తవ్వుతున్న దృశ్యం

ఆనందపురంలో మట్టి దందా

బారికోడికల్లాలు సమీపాన గల రాజుగారి చెరువులో ఎస్కవేటర్లతో తవ్వకాలు

- ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మకం
- పట్టించుకోని పంచాయతీ, గనుల శాఖ అధికారులు
- అడ్డుకున్న గ్రామస్థులు
- గత ఐదేళ్లుగా మండలంలో పలుచోట్ల కొండలు తవ్వేసిన అక్రమార్కులు

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలంలోని పలు చెరువుల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గత ఐదేళ్ల నుంచి భారీఎత్తున తవ్వకాలు చేపట్టిన ముఠాలు ఇప్పటికీ దందా కొనసాగిస్తున్నాయి. ఆనందపురం గ్రామ శివారు బారికోడి కల్లాలు సమీపాన గల రాజుగారి చెరువులో రెండు, మూడు రోజుల నుంచి మట్టి తవ్వి తరలించుకుపోతున్నారు. ఏకంగా మూడు ఎస్కవేటర్లతో తవ్వకాలు చేపట్టారు. సమీపంలో ఇటుక బట్టీలకు కొంత విక్రయిస్తున్న అక్రమార్కులు మిగిలింది రియల్ ఎస్టేట్ సంస్థలకు సరఫరా చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న ఈ చెరువులో తవ్వకాలు చేపట్టాలంటే సంబంధిత అధికారుల ద్వారా గనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. అటువంటిదేమీ లేకుండా చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు, గనుల శాఖ సిబ్బంది, గనుల శాఖలో విజిలెన్స్ విభాగం పట్టించుకోవడం లేదు. మండలంలో గత ఐదేళ్ల నుంచి అక్రమంగా సాగుతున్న మట్టి, గ్రావెల్ ... మిగతా 4వ పేజీలో

పెందుర్తిలో ప్రభుత్వ స్థలం కబ్జా

పట్టాలున్నాయంటూ పక్కా నిర్మాణాలు

- అవి నకిలీవిగా రెవెన్యూ పరిశీలనలో బట్టబయలు
- స్వాధీనానికి సిద్ధమవుతున్న అధికారులు

పెందుర్తి, జూన్ 19:

పెందుర్తి మండలంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణదారుల పాలవుతోంది. పట్టాలున్నాయని రెవెన్యూ యంత్రాంగాన్ని కొందరు తప్పుదారి పట్టించి ఎంచక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులకు స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో ఈ భూబాగోతం బయటపడింది.

పెందుర్తి సర్వే నంబర్ 117లో గల 22 సెంట్ల ప్రభుత్వ భూమిలో కొంతమంది దర్జాగా పాగా వేశారు. ఈ స్థలం ఓ ప్రైవేటు లేఅవుట్‌ను ఆనుకుని ఉండడం



పెందుర్తిలో ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు

ఆక్రమణదారులకు కలిసివచ్చింది. పూర్వం నుంచి పెందుర్తి సమీపంలోని గల దొగ్గవానిపాలెంలో గెడ్డ పోరంబోకు భూమి ఉంది. అదే స్థలం రాస్తా (రహదారి)గా మారింది. కాలక్రమంలో చుట్టుపక్కల భూములు లేఅవుట్లుగా మారాయి. ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరగడంతో స్థలాల విలువ భారీగా పెరిగింది. ప్రస్తుతం అక్కడ గజం రూ.30 వేలకుపైగానే ఉంది. ఈ క్రమంలో ... మిగతా 4వ పేజీలో

ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదుచేస్తాం

పెందుర్తి సమీపంలోని దొగ్గవానిపాలెంలో సర్వే నంబర్ 117లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. స్థల పరిరక్షణకు చర్యలు చేపట్టి హెచ్చరిక బోర్డులు పెట్టనున్నాం. ఆక్రమణదారులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తాం.

-తహసీల్దార్ బంగార్రాజు, పెందుర్తి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూన్ 19: విద్యుత్ నిర్వహణ పనుల చేపడుతున్నందున గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు, కేఆర్ఎం కాలనీ, కాకతీయ ఫంక్షన్ హాలు, జయభేరి ప్రాంతం, భావన స్కూల్ ప్రాంతం, సత్యం జంక్షన్ ప్రాంతం, ఏఎంజీ ఆసుపత్రి ప్రాంతం, క్రాంతినగర్, ఆంధ్రాబ్యాంక్, హెచ్‌టీ సర్వీస్, సీతమ్మధార సెయిల్ క్వార్టర్స్, పోస్టు ఆఫీస్ ప్రాంతం, హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్‌స్టాప్ తదితర ప్రాంత విని యోగదారులు సహకరించాలని కోరారు.

సాంకేతికతతో గంజాయి రవాణాకు అడ్డుకట్ట

▸▸ నగర కమిషనర్ రవిశంకర్ అయ్యనార్

మహారాణిపేట, జూన్ 19: గంజాయి సాగు నిర్మూలన, సరిహద్దునున్న ఒడిశానుంచి రవాణా అడ్డుకట్టకు అత్యాధునిక సంకేతికతను వినియోగించనున్నట్టు నగర పోలీసు కమిషనర్ ఏ రవిశంకర్ అయ్యనార్ తెలిపారు. గంజాయి, ఇతర డ్రగ్స్ నివారణకు నివారణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ఇంటర్ డిపార్టుమెంట్ కో ఆర్డినేషన్ సమావేశం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. గంజాయి ప్రాంతాలను తొలుత గుర్తించి దీని రవాణా అడ్డుకట్టకు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఎన్‌డీపీఎస్ నేరస్తుల బ్యాంక్ స్టేట్‌మెంట్లు, నేరస్తుల ఎలక్ట్రానిక్ డివైజస్‌లు విశ్లేషించటానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. గంజాయి మూలన్ని తెలుసుకుని వేరు చేయటం, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రమేయం కలిగి రిమాండ్‌లో ఉన్న నేరస్తుల ములాఖత్‌లపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. సముద్ర మార్గాలపై ప్రత్యేక నిఘా, స్నేపర్ డాగ్స్ సేవలు, నార్కోటిక్స్‌ను గుర్తించేందుకు డాగ్స్ ప్రత్యేక శిక్షణ. డ్రగ్స్ దుర్వినియోగంపై షార్టు ఫిలిం పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తామన్నారు. ప్రత్యేక టోల్ ఫ్రీ నంబరు 14500 ఏర్పాటుచేసినట్టు చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల వారి బ్యాగులు, లాకర్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు, జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవిశంకర్ అయ్యనార్

వైభవంగా రమా సత్యనారాయణస్వామి రథయాత్ర

మహారాణిపేట, జూన్ 19: ఇసుకకొండ శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రథయాత్రను నిర్వహించారు. కొవిడ్ కారణంగా గత ఐదేళ్లనుంచి నిలిచిపోయిన స్వామి వారి రథయాత్ర ఈ ఏడాది మళ్లీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మేళతాళాలు, హరినామ కీర్తనలతో అంగరంగ వైభవంగా ఈ వేడుకను నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అలంకరణలో వెంకటేశ్వర స్వామి


సత్యనారాయణస్వామి విగ్రహం ఊరేగింపు

పోర్టు వెంకటేశ్వరుని కల్యాణం..

మహారాణిపేట: పోర్టు ఏరియాలోని శృంగముని పర్వతంపై వేంచేసిన శ్రీ వెంకటేశ్వర సామి వారి కల్యాణ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునుని వేదికపై అధిష్ఠంజేసి వేదమంత్రాలు, మంగళవాద్యాల మధ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సు ప్ర భాత సేవలు, హోమాలు నిర్వహించారు. ఈ నెల 21 వ తేదీన స్వామి వారి ఊరేగింపు, సముద్రంలో తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

ఉమా చంద్రమౌళీశ్వరస్వామి పందిరాట

డాబాగార్డెన్స్, జూన్ 19: డాబాగార్డెన్స్‌లోని శ్రీ శివ రామకృష్ణ దేవాలయంలో శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి దివ్య కల్యాణమహోత్సవాలను గురువారంనుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి, జేఏ కె.మన్మథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, కల్యాణం రాట , కంకణధారణ శాస్త్రోత్తంగా నిర్వహించినట్టు చెప్పారు. 20న పుణ్యాహవచనం, దీక్షా వస్త్రధారణ, కంకణధారణ, అంకురారోపణ, సాయంత్రం అగ్ని ప్రదక్షణత్రం ఉంటాయన్నారు. 21న పంచామృత అభిషేకం విశేష అలకారం, సాయంత్రం ఊరేగింపు స్వామివారిని ఉత్సవ విగ్రహాల గ్రామ ప్రదక్షిణ జరుగుతుందన్నారు. సాయంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. భక్తులందరూ పాల్గొని ఈ కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జి.భార్గవశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ రాట వేస్తున్న అర్చకులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి: డీఎంహెచ్‌వో

సీతమ్మధార, జూన్ 19: వర్షాకాలంలో కీటక జనిత (దోమల ద్వారా) మలేరియా, డెంగ్యూ చికున్ గున్యా, బోదకాలు తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో ఎ.జగదీశ్వరరావు తెలిపారు. తన కార్యాలయంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీ రాజ్ మాట్లాడుతూ ముఖ్యంగా దోమలు వ్యాప్తి అరికట్టాలన్నారు. పరిసరాల పరిశు భ్రతపై జనాలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా మీడియా అధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ సమత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డిఐఒ బి.నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది నాగభూషణ్, ఎంపీహెచ్‌ఈవో పాల్గొన్నారు.

సికిల్ ఎనిమియా వ్యాధి నిర్మూలనే ధ్యేయం

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలన మిషన్ ప్రకటించినట్టు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. సికిల్ సెల్ ఎనిమియాడే సందర్భంగా మారికవలస బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజన ప్రాంతాలలో 40 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ అవగాహన కల్పించడం, సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా.బి.ఉమావతి, నోడల్ అధికారి అఖిల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.విశ్వనాథ్, హాస్టల్ వార్డెన్, మధురవాడ మెడికల్ అధికారి డా.ప్రశాంతి, మారికవలస మెడికల్ అధికారి డా.చైతన్య, సిబ్బంది, నాగభూషణం, ఎంపీహెచ్‌ఈఓ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ

అక్కయ్యపాలెం, జూన్ 19: మత్తు పదార్థాల రహిత నగరంగా విశాఖను తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్క రూ ముందుకు రావాలని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.లక్ష్మీనరస, పీడీ ఎ.సునంద్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మారక ద్రవ్యాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా ఫోన్: 14500 తెలియజేయాలని కోరారు. అనంతరం 80 అడుగుల రోడ్డు మహారాణి పార్లర్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రమిల, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్రిపాలెం: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ, చక్కగా చదువుకోవాలని ఎయిర్‌పోర్ట్ సీఐ వి.చక్రధరరావు అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనా చర్యల్లో భాగంగా బుధవారం పోలీసులు ఎన్‌ఏడీ ప్రాంతంలో ఉన్న పలు కళాశాల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు స్నేహాలు చేసి తప్పుడు మార్గాన్ని అనుసరించవద్దన్నారు. గంజాయి, మద్యం, మత్తు పదా ర్థాలకు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

చెత్తను తొలగించారు..

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సీతమ్మధార, జూన్ 19: గ్రేటర్ 23వ వార్డు చైతన్యనగర్, మద్దిలపాలెం రోడ్డులో ఉన్న చెత్త కుప్పలు, వ్య ర్థాలను జీవీఎంసీ అధికారుల ఆదే శాలతో బుధవారం సిబ్బంది తొలగించా రు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 19న 'చెత్తను తొలగించేదెన్నడో..?' శీర్షికన ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వారి ఆదేశాలపై సిబ్బంది చెత్త ను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.


మద్దిలపలెం రోడ్డుపై చెత్త తొలగించిన దృశ్యం

రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గోపాలపట్నం, జూన్ 19: కొత్తవలస సమీపంలోని దేశపాత్రునిపాలేనికి చెందిన ఇల్లపు వినయ్ (28)కు మతిస్థిమితం లేకపోవడంతో తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోతాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంతానికి వచ్చిన వినయ్ ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతుని వద్ద లభించిన ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లా శ్రీనివాసరావుకు అభినందనల వెల్లువ


పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

మహారాణిపేట, జూన్ 19: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బొట్ట పరదేశీయాదవ్, చింతపల్లి చినపోలరాజు, ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్‌గౌస్, వైస్ ప్రెసి డెంట్ షేక్ ఖాలీషా, నమ్మి రవికుమార్ తదితరులు పా ల్గొన్నారు.

అక్కయ్యపాలెం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, 44వ వార్డు ఇన్‌చార్జి కొయిలాడ వెంకటేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు సారథ్యంలో రా ష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని విశాఖ పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్ష, కార్యదర్శులు మొల్లేటి కుమారస్వామి, దువ్వి కాశీప్రసాద్ అన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబా బు, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని కలిసిన వారిలో నాయకులు వరడా సంతోష్‌కుమార్, ఎస్.పుల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అయ్యన్నపై అభిమానం...

అప్పన్నపై భక్తితో పాదయాత్ర


సింహాచలం వచ్చిన నాతవరం టీడీపీ అభిమానులు

సింహాచలం, జూన్ 19: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం వరాహలక్ష్మీనృసింహస్వామిపై అచంచల భక్తి, తమ నాయకుడు అయ్యన్నపాత్రుడిపై వల్లమాలిన అభిమానంతో నాతవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు సింహగిరికి పాదయాత్రగా చేరుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన వీరాభిమానులు సుమారు 30 మంది ఈనెల 17న ఉదయం తమ గ్రామం నుంచి పాదయాత్రగా బుధవారం సాయంత్రం సింహగిరికి చేరుకున్నారు. వారంతా వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమ స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు.

ఆనందపురంలో మట్టి దందా

... 3వ పేజీ తరువాయి

తవ్వకాలు/విక్రయాలకు పంచాయతీలో కొందరి దన్ను ఉందనే ఆరోపణలు ఉన్నాయి. మట్టి తవ్వకాలపై బుధవారం కొందరు గ్రామస్థులు పంచాయతీ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరు స్పందించలేదు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులకు ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో డయల్ యువర్ 100కి ఫోన్ చేస్తే కానిస్టేబుళ్లు వచ్చారు. అప్పటికే స్థానికులు అభ్యంతరం చెప్పడంతో లారీలు, ఎస్కవేటర్లను తవ్వకందారులు అక్కడ నుంచి తీసుకుపోయారు. ఇదేవిధంగా గత ఐదేళ్లలో మండలంలోని గిడిజాల, ఆనందపురం, దువ్వివానిపాలెం, గండిగుండం, మామిడిలోవ, రామవరం, తదితర గ్రామాల్లో కొండవాలు ప్రాంతాల్లో లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వేశారు. గనుల శాఖ, రెవెన్యూ శాఖ తూతూమంత్రంగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు తప్ప అక్రమ తవ్వకాలను అడ్డుకోలేకపోయారు. ప్రభుత్వం మారినందున ఇప్పటికైనా అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

పవన్ కల్యాణ్‌కు అటవీశాఖ అధికారుల సంఘం అభినందన

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను బుధవారం అమరావతిలో రాష్ట్ర అటవీశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు జి. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు, జాయింట్ సెక్రటరీ శర్మ, సభ్యులు సోమసుందరం, అప్పన్న మర్యాదపూర్వకంగా కలిశారు. అటవీ, పర్యావరణ శాఖకు పవన్‌కల్యాణ్ మంత్రి కావడంతో లక్కీ ప్లాంట్‌ను బహూకరించారు.


లక్కీప్లాంట్ అందిస్తున్న లక్ష్మణ్

పవన్‌ను కలిసిన జనసేన నేత సాధిక్

జగదాంబ కూడలి: రాష్ట్ర డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్‌ను జనసేన ఉత్తరాంధ్ర జిల్లా కో-కన్వీనర్, జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అటకెక్కిన గస్తీ, భయం నీడన బస్తీ!!

... 3వ పేజీ తరువాయి

నిర్లక్ష్యం వహించారు. దీంతో ప్రస్తుతం సగం బీట్‌లు కూడా నడవని పరిస్థితి నెలకొంది. అంతేగాకుండా బీట్ సిబ్బంది తూతూమంత్రంగా తమకు కేటాయించిన రూట్‌లో పహారా కాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి పది గంటలకు పోలీస్ స్టేషన్ నుంచి బీట్ బుక్ తీసుకుని బయలుదేరుతున్నారు. ఒక గంటసేపు బీట్ రూట్‌లో తిరిగిన తర్వాత కొందరు సినిమా థియేటర్లకు వెళ్లి కాలక్షేపం చేస్తే, మరికొందరు ఏకంగా ఇళ్లకు వెళ్లి నిద్రపోతున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు తిరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బీట్ బుక్‌ను అప్పగించి డ్యూటీ దిగిపోతున్నారు. దీనివల్ల రాత్రి పూట నగరంలో పోలీసుల గస్తీ నామమాత్రంగా మారింది. ఇదే అదనుగా ఆకతాయిలు, నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం నేరం జరగడానికి గల కారణం ఏమిటనే దానిపై పరిశోధన చేయకపోవడం, కారణం తెలిసినా పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు.

ఒంటరిగా కనిపిస్తే అంతే సంగతి

పోలీసుల గస్తీ కొరవడడంతో నగరంలో రాత్రి పదకొండు గంటల దాటిన తర్వాత ఒంటరిగా నడిచి వెళ్లాలన్నా, బైక్‌పై వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారిపైనా, పాతజైలురోడ్డు, సీతమ్మధార, రైల్వేన్యూకాలనీ, శివాజీపాలెం, రామాటాకీస్ పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు గుంపులుగా రోడ్లపై చేరుతున్నారు. బైక్‌లతో చీకటిగా ఉండే ప్రాంతాల్లో మాటువేసి ఒంటరిగా నడిచి వచ్చేవారిని, బైక్‌పై వచ్చే వారిని వెంబడించి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఎవరైనా ప్రతిఘటిస్తే వారిపై మూకుమ్మడిగా దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నెల రోజులు కిందట పాతజైలురోడ్డు వద్ద రాత్రి 11 గంటల సమయంలో ఒక మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి పరారైపోయారు. తాజాగా అదేచోట మంగళవారం రాత్రి పది గంటల సమయంలో వాకింగ్ చేస్తున్న వ్యక్తిపై ఇద్దరు యువకులు దాడి చేశారు. అక్కడకు కూతవేటు దూరంలోనే రామ్‌నగర్ బజార్ వద్ద 17వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో నడిచి వెళుతున్న మహిళ చేతిలోని బ్యాగ్‌ను తెంచుకుపోయారు. ఈనెల 13న జాతీయ రహదారిపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో (ఈటర్స్ స్టాప్ వద్ద) ఒక ప్రైవేటు ఉద్యోగిపై బైక్ వచ్చిన ముగ్గురు దాడికి యత్నించారు. ఆయన కేకలు వేయడంతో పరారయ్యారు. అలాగే మూడు నెలల కిందట తాటిచెట్లపాలెం ప్రాంతంలో ప్రైవేటు ఉద్యోగిపై దాడి చేసి అతని సెల్‌ఫోన్‌తో పాటు జేబులోని డబ్బులు లాక్కొన్నారు. ఇలాంటి ఘటనలు చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి.

పనిచేయని వీధి దీపాలు

జాతీయ రహదారితోపాటు వీధుల్లో ఉన్న దీపాల్లో దాదాపు సగం వరకూ పనిచేయడం లేదు. దీంతో రాత్రిపూట ఆయా ప్రాంతాలన్నీ చీకటిమయంగా మారిపోతున్నాయి. అదేవిధంగా రోడ్లకు ఇరువైపులా చెట్లు గుబురుగా ఉన్నచోట్ల కూడా చీకటిగానే ఉంటోంది. ఆకతాయిలు, నేరగాళ్లు...అటువంటి ప్రాంతాల్లోనే దోపిడీలకు పాల్పడుతున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినాసరే నగరంలోని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరస్థులను గుర్తించలేకపోతున్నారు. నగరంలో 1700 సీసీ కెమెరాలు ఉంటే, వాటిలో కేవలం 700 మాత్రమే పనిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి ఉంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎలా సాధ్యమవుతుందని తాను నగర పోలీస్ కమిషనర్‌ను నేరుగా ప్రశ్నించానని, త్వరలోనే వాటికి మరమ్మతులు చేయిస్తామని చెప్పారని రాష్ట్ర హోం మంత్రే వెల్లడించారు.

ఆస్తి పన్ను చెల్లింపునకు తంటాలు

... 3వ పేజీ తరువాయి

సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా పన్ను వసూలు జరుగుతుంది. గత మూడు రోజులుగా సీడీఎంఏ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో వార్డు సచివాలయాల్లో ఆస్తిపన్ను వసూళ్లు నిలిచిపోయాయి. పన్ను చెల్లింపుదారులు అక్కడకు వెళితే సర్వర్ డౌన్‌లో ఉన్నందున పన్ను కట్టించుకునే పరిస్థితి లేదని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో వారంతా వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఈ నెలాఖరులోగా చెల్లించకపోతే వడ్డీ పడిపోతుందని, అది ఎవరు భరిస్తారని కొందరు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

... 3వ పేజీ తరువాయి

ఇవ్వాలో లెక్కలు ఉన్నాయి. వాటిని పాటించే దిక్కే లేదు. మధ్యాహ్న భోజనం కింద అన్నం, సాంబారు, పప్పు, కూర, మజ్జిగ, అరటిపండు, గుడ్డు ఇవ్వాలి. రాత్రికి మజ్జిగ, అరటిపండు తీసేసి మిగిలినవన్నీ ఇవ్వాలి. ఎవరైనా రోగులు పుల్కాలు, రోటీ అడిగితే పెట్టాలి. మూడు పూటలూ గుడ్డు అందించాలి. ఈ భోజనంలో కూరలు, పప్పు గురించి చెప్పనక్కర్లేదు. రుచి అంతంతమాత్రమే. ఆ ఆహారం రోగులకు సాయంగా ఉండేవారు తిని, బయట నుంచి మంచి ఆహారం తీసుకువచ్చి రోగులకు పెడుతున్నారు. ఈ విషయాలన్నీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

వారం నుంచి ఉప్మాయే

మా అమ్మాయికి ఆరోగ్యం బాగా లేదని వారం క్రితం తీసుకువచ్చి చేర్పించాం. గైనిక్ వార్డులో చికిత్స చేస్తున్నారు. వారం నుంచి టిఫిన్ కింద రోజూ జావలాంటి ఉప్మా ఇస్తున్నారు. గట్టిగా అడిగితే పంపించేస్తారని ఏమీ అనలేకపోతున్నాం.

- మధు, సీతంపేట

చేతికి అంటుకుంటోంది



డెలివరీ కోసం వచ్చాము. గైనిక్ వార్డులో ఉంటున్నాం. రోజూ ఈ ఉప్మా ఇస్తున్నారు. ప్లేటులో వేయగానే మొత్తం పరుచుకుపోతోంది. చేతితో తినలేకపోతున్నాం. చెంచాతో తినాలని అనుకుంటే జారి కింద పడిపోతోంది. భోజనం కూడా రుచిగా ఉండడం లేదు.

- బి.రాణి, శాలిపేట

పెందుర్తిలో ప్రభుత్వ స్థలం కబ్జా

... 3వ పేజీ తరువాయి

రాస్తాగా మారిన సర్వే నంబర్ 117లోని 22 సెంట్ల ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూమిపై పలువురి కళ్లు పడ్డాయి. అంతా కలిసి ఈ భూమిని కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. తమకు గతంలో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరుచేసిందని పేర్కొంటూ ఆ జాగాలో పాగా వేశారు. కొంతకాలం తరువాత ఆ స్థలాలు చేతులు మారాయి. ఇప్పుడు వాటిల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయమై ఫిర్యాదు రావడంతో రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టగా ఇళ్ల పట్టాలు నకిలీవిగా తేల్చారు. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్టు తమ విచారణలో తేలినట్టు సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.



యోగాసనాలను నేర్పిస్తున్న ట్రైనర్

యోగాసనాలపై శిక్షణ

అగనంపూడి, జూన్ 19: ప్రజాపిత ఈశ్వరీ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనంలో బుధవారం యోగాసనాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ బీకే సోమేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మానసిక ప్రశాంతత కోసం ప్రతిఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న మెడిటేషన్ కేంద్రాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిక్షకులు చంద్రశేఖర్ యోగాసనాల గురించి వివరించడంతో పాటు యోగా చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, ఇన్‌చార్జి రామకోటి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, జూన్ 19: కొత్తపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, డీఏఆర్ నగర్, సంతోశ్‌నగర్, సూర్యనగర్, గణేశ్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

ఆటోనగర్: చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. అందువల్ల శ్రామిక నగర్, చినగంట్యాడ, శ్రీనివాసనగర్, దత్తసాయినగర్, కోర్టు ఏరియా, ఎర్రగెడ్డ కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రజా రవాణాను బలోపేతం చేయాలి

కూర్మన్నపాలెం, జూన్ 19: ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వం నూతన బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీని బలోపేతం చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోలో ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈయూ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత రవాణా అవకాశాన్ని కల్పిస్తున్న శుభ తరుణంలో నూతన బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు సత్యమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ జరపాలనీ, 2017 ఆర్‌పీఎస్ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం కృషి చేయాలని, ఖాళీల మేరకు ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. సమావేశంలో యూనియన్ డిపో అధ్యక్షుడు కేఎస్ ప్రకాశ్, కార్యదర్శి రాము, నారాయణమ్మ, కుమార్, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలంటూ 'పల్లా'కు వినతి

అగనంపూడి, జూన్ 19: అగనంపూడితో పాటు పరిసర ప్రాంతాల్లో గల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కూటమి స్థానిక నాయకులు బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్న అగనంపూడి టోల్ గేటును తొలగించాలని కోరారు. అలాగే హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో స్థానికంగా గల నిరుద్యోగ యువతికి ఉపాధి కల్పించాలని, లోఓల్టేజీ సమస్య లేకుండా సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కూటమి నాయకులు . సత్యనారాయణ, జి.అప్పారావు, కె.శ్రీనివాసరావు, నరసింగరావు, తాతారావు, కట్టా పైడిరాజు, రాము, తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 58, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 52, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 42, బంగాళదుంపలు 31, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 160, బరబాటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్(పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, క్యాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ప్రధాన గెడ్డల అభివృద్ధికి చర్యలు

ప్రధాన గెడ్డల అభివృద్ధికి చర్యలు

గాజువాక పరిసరాల్లో పది గెడ్డలను గుర్తించిన అధికారులు

డ్రైనేజీల మరమ్మతులకు నివేదికలు సిద్ధం



గాజువాకలోని ప్రధాన గెడ్డ

గాజువాక, జూన్ 19: గాజువాక నియోజకవర్గ పరిధిలోని ప్రధాన గెడ్డల అభివృద్ధిపై జీవీఎంసీ జోనల్ అధికారులు దృష్టిసారించారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో ప్రధాన గెడ్డలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. దీంతో గాజువాక పరిధిలో ఎన్ని ప్రధాన గెడ్డలు ఉన్నాయి, ప్రస్తుతం అవి ఏ విధంగా ఉన్నాయన్న దానిపై సర్వే చేపట్టారు. సుమారు పది వరకు ప్రధాన గెడ్డలు ఉండగా, అధిక శాతం గెడ్డలకు రిటెయినింగ్ వాల్స్ లేకపోవడం, ఉన్నవి కాస్త శిథిలావస్థకు చేరుకోవడాన్ని వారు గుర్తించారు. దీంతో రిటెయినింగ్ వాల్స్ లేని ప్రధాన గెడ్డలన్నింటికీ వాటిని నిర్మించడంతో పాటు గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించాలని నిర్ణయించారు.

అంతేకాకుండా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరంతా దిగువకు సులువుగా ప్రవహించేలా డ్రైనేజీలను నేరుగా గెడ్డలకు అనుసంధానం చేసేలా చర్యలు చేపడుతున్నారు. కాగా పలు ప్రాంతాల్లోని డ్రైనేజీలు కూడా జీర్ణావస్థకు చేరుకోవడంతో ఇళ్ల నుంచి, కొండ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వర్షాల సమయంలో నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోవడంతో వీధులు, ప్రధాన రహదారులపైకి మురుగు నీరు వచ్చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అందువల్ల డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. సుమారు ఇరవై డ్రైనేజీలను అభివృద్ధి చేసే దిశగా అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

శ్రీహరిపురం గెడ్డను ఆధునీకరించరా?

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో గెడ్డల ఆధునీకరణ పనులను పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌పీసీఎల్‌కు సంబంధించిన గెడ్డకు మల్కాపురం, శ్రీహరిపురం గెడ్డలు అనుసంధానంగా ఉన్నాయి. ఈ గెడ్డల ద్వారా వాడుక, వర్షపు నీరు హెచ్‌పీసీఎల్ లోపల ఉన్న గెడ్డలోకి వెళ్లి అక్కడి నుంచి సముద్రంలో కలుస్తుంది. అయితే హెచ్‌పీసీఎల్‌కు దొంగల బెడద ఉన్న నేపథ్యంలో సంస్థలో ఉన్న గెడ్డ మార్గం ద్వారా ఎవరూ లోపలకు రాకుండా ఉండేందుకు యాజమాన్యం గ్రిల్స్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఈ గ్రిల్స్ వద్దే పెద్దఎత్తున చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో మురుగు నీరు ముందుకు వెళ్లక ఒక్కోసారి గ్రామాలోకి వచ్చేస్తోంది. వర్షాలు కురిసేటప్పుడు శ్రీహరిపురం, గుల్లలపాలెంలలో ఈ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గెడ్డలను ఆధునీక రిస్తామని హెచ్‌పీసీఎల్ యజమాన్యం సంస్థ విస్తరణ సమయంలో హామీ ఇచ్చింది. ఈ మేరకు మల్కాపురం గెడ్డను మాత్రం ఆధునీకరించి, శ్రీహరిపురం గెడ్డ పనులను పూర్తి చేయలేదు. దీనిపై పలుమార్లు ఎమ్మెల్యే గణబాబు హెచ్‌పీసీఎల్ యాజమాన్యంతో మాట్లాడినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డలను ఆధునీకరించాలని పలువురు కోరుతున్నారు.



ఆధునీకరణకు నోచుకోని శ్రీహరిపురం గెడ్డ

పారిశ్రామిక ప్రాంతాన్ని క్రీడలకు వేదికగా మారుస్తా

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూన్ 19: పారిశ్రామిక ప్రాంతాన్ని క్రీడా రంగానికి వేదికగా మారుస్తామని, ఈ క్రమంలో ఇక్కడ ఇండోర్ స్టేడియం, అన్ని సౌకర్యాలతో కూడిన మైదానం, స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మిస్తామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. 60వ వార్డు ఎంఐఈ క్వార్టర్స్‌లోని వాకర్స్ మైదానం, నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం, ఇటీవల కొత్తగా ఎంబీజీ క్వార్టర్స్‌లో నిర్మించిన వాకర్స్ పార్కును బుధ వారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, వాకర్స్‌తో ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు సౌకర్యంగా ఉండేలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని, త్వరతగతిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇండోర్ స్టేడియం గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అనంతరం గణబాబు కాసేపు సరదాడా షటిల్ ఆడడంతో పాటు వాకింగ్ చేశారు. ఆ తర్వాత రహదారి పలువురితో కలిసి రోడ్డు పక్కన టిఫిన్ చేసి, స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. గణబాబు వెంట పలువురు నాయకులు, అధికారులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ఆటోనగర్, జూన్ 19: యువశక్తి దేశానికి ఎంతో అవసరమని, నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక టీఎస్ఆర్ టీబీకే కళాశాలలో బుధవారం వంద రోజుల్లో డ్రగ్స్ రహిత ఏపీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చెడు వ్యసనాల వల్లే ఎక్కువ మంది యువత నేరాలకు పాల్పడుతూ జైలుశిక్ష అనుభవిస్తున్నారన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడితే యువత భవిష్యత్తు నిర్వీర్యమవుతుందన్నారు. యువతలో మార్పు తీసుకువచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పల్లా పేర్కొన్నారు. డీసీపీ మోకా సత్తిబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి యువత పోకూడదన్నారు. హాబీస్ హ్యాబిట్స్‌గా మారుతాయని, మంచి స్నేహితులతో ముందుగా సాగాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే విద్యార్థుల జీవితాలు ఛిద్రమవుతాయని, అందువల్ల అందరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఏసీపీ త్రినాథ్ మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపకపోతే విద్యార్థుల జీవితాలు అంధకారమవుతాయన్నారు. తమ పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు. కళాశాల ఛైర్మన్ తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

యాప్ నిర్వాహకుల పేరుతో అధ్యాపకురాలికి బురిడీ

ఆమె బ్యాంకు అకౌంట్ నుంచి రూ.22,500 డ్రా చేసిన ఆన్‌లైన్ మోసగాళ్లు

గోపాలపట్నం, జూన్ 19: ప్రయాణం చేయడం కోసం ర్యాపిడో వాహనాన్ని బుక్ చేసిన ఓ మహిళను యాప్ నిర్వాహకుల పేరిట బురిడీ కొట్టించి ఆమె అకౌంట్‌లోని నగదును కాజేశారు ఆన్‌లైన్ మోసగాళ్లు. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 89వ వార్డు పరిధి ఎల్లపువానిపాలేనికి చెందిన ఆర్.సుమ శీలానగర్‌లోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు.

బుధవారం సాయంత్రం ఆమె ర్యాపిడో యాప్ ద్వారా వాహనాన్ని బుక్ చేశారు. అయితే యాప్ పని చేయడం లేదని సెల్ ఫోన్‌కు మెసేజ్ రావడంతో కస్టమర్ కేర్‌తో ఆమె మాట్లాడారు. కస్టమర్ కేర్ సెంటర్ నుంచి వచ్చిన సందేశానుసారం అన్ని వివరాలను పంపి సుమ రూ.2 జమ చేశారు. వెంటనే ఆమె బ్యాంకు అకౌంట్ నుంచి రూ.19,958, మరికాసేపటి తర్వాత రూ.2,542 నగదు డ్రా చేసినట్టు సెల్ ఫోన్‌కు సమాచారం వచ్చింది. దీంతో తాను ఆన్‌లైన్ మోసానికి గురైనట్టు ఆమె గుర్తించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపాలపట్నం పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే బండారుకు జన్మదిన శుభాకాంక్షలు



బండారుకు పుష్పగుచ్ఛం అందిజేస్తున్న టీడీపీ పెందుర్తి నాయకులు



బండారును గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

పెందుర్తి, జూన్ 19: మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పెందుర్తి ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వారు పెందుర్తి నుంచి ర్యాలీగా తరలివెళ్లి మాడుగులలో జరిగిన వేడుకల్లో బండారును కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు వేగి పరమేశ్వరరావు, కరక దేవుడు, పీటీఎస్ఎన్ బుచ్చిరాజు, కె.సుందరరావు, డి.ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వేపగుంట సమీపం కృష్ణరాయపురానికి చెందిన టీడీపీ నాయకుడు బొబ్బర నరసింహ నాయుడు ఆధ్వర్యంలో పలువురు భారీ గజమాల వేసి సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక సాయంత్రం సేనాతివానిపాలెంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యువతకు సూచనలిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

గంజాయి నియంత్రణకు చర్యలు

దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు

కూర్మన్నపాలెం, జూన్ 19: రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు, సీపీ సూచనల మేరకు గంజాయి నియంత్రణకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, దువ్వాడ, తదితర ప్రాంతాల్లో దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు, యువత గంజాయికి బానిసలు కాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు, లారీలు, రైళ్లల్లో కూడా సోదాలు చేస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి నివారణకు ప్రజలు కూడా తమ సహకారాన్ని అందించాలని ఎర్రంనాయుడు కోరారు. రాత్రి వేళల్లో యువత గుంపులుగా తిరగరాదని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని పలువురికి అవగాహన కల్పించారు.

ఎస్సీ, ఎస్టీ పథకాలను పునరుద్ధరించాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 19: గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని, రద్దు చేసిన 27 ఎస్సీ, ఎస్టీ పథకాలను పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ఉపాధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య ఒక ప్రకటనలో కోరారు. 'వైసీపీని ఓడించండి-అమరావతిని రాజధానిగా చేయండి' అనే నినాదంతో ఎన్నికల సమయంలో జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చైతన్య సభలు నిర్వహించామన్నారు. జగనన్న పేరుతో ఉన్న విదేశీ విద్యకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యగా పేరు పెట్టినందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సాయికుమార్‌కు బంగారు పతకం



సాయికుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

పెందుర్తి, జూన్ 19: ఇక్కడి ఆదిత్యనగర్‌లోని యూనిక్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి గ్రీష్మ వెంకట సాయికుమార్ రాష్ట్ర స్థాయిలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర తొమ్మిదో పెన్‌కాక్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో టెండాక్ పోటీల్లో 55 కిలోల విభాగంలో సాయికుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన అభినందన సభలో పాఠశాల కరస్పాండెంట్ నానీ సర్, తదితరులు సాయికుమార్‌ను అభినందించారు.



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కరణంరెడ్డి, తదితరులు

పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు

గాజువాక, జూన్ 19: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో పల్లా విజయం సాధించడం ఎంతో గర్వంగా ఉందని, టీడీపీలో అత్యున్నత పదవి గాజువాక ప్రాంత ఎమ్మెల్యేకు దక్కడం ఆనందంగా ఉందని నరసింగరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బొండా యల్లాజీరావు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కరణం కనకారావు, వెంకటరావు, సీఎం ప్రసాద్, అచ్చిబాబులు పల్లాను కలిసి అభినందనలు తెలిపారు.

పవన్‌కల్యాణ్‌కు కలిసిన పంచకర్ల



పవన్‌కల్యాణ్‌తో పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూన్ 19: ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూచేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన జెడ్సీ

పెదగంట్యాడ, జూన్ 19: పెదగంట్యాడలోని భవిత కేంద్రాన్ని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు బుధవారం సందర్శించారు. పచ్చదనం పరిరక్షణలో భాగంగా ఈ కేంద్రంలో గురువారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్, డీఈవో, జేసీ, ఆర్డీవో, తదితరులు మొక్కలు నాటనున్నారు. ఈ నేపథ్యంలో జెడ్సీ ఇక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. జెడ్సీ వెంట ఐఈఆర్‌టీ కో-ఆర్డినేటర్ గీత, ఎంఈవో శ్రీనివాసరావు ఉన్నారు.

జీతాల కోసం కాంట్రాక్టు కార్మికుల ఎదురుచూపులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 19: స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కొంతమంది కాంట్రాక్టు కార్మికులు జీతాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఉక్కు కర్మాగారంలో సుమారు 11 వేల మంది వరకు కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో అత్యధిక శాతం మందికి నెలనెలా జీతాలు అందడం లేదు. కొన్ని విభాగాల్లో అయితే నాలుగైదు నెలలుగా జీతాల అందక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లను కార్మికులు జీతాల కోసం అడిగితే బిల్లులు అవ్వడం లేదని చెబుతున్నారని, అధికారులను అడిగితే మాకే జీతాలు ఇంకా ఇవ్వలేదని పేర్కొంటున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ ఉత్పత్తిలో ఉద్యోగులతో పాటు సమానంగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులపై చిన్నచూపు చూడడం భావ్యం కాదని, ఉక్కు యాజమాన్యం స్పందించి జీతాలు అందించేందుకు కృషి చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు: ఈపీడీసీఎల్ ఎస్ఐ మహేంద్రనాథ్

వేపగుంట, జూన్ 19: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వాటిల్లకుండా చర్యలు చేపడుతున్నట్టు ఈపీడీసీఎల్ ఎస్ఈ (ఆపరేషన్స్) ఎస్ఈ మహేంద్రనాథ్ పేర్కొన్నారు. వేపగుంట సమీపం చీమలాపల్లి సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 11కేవీ బ్రేకర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ తరచూ వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ఉండేందుకు, మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన బ్రేకర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఈ ఎస్.అప్పన్నబాబు, ఉదయ్‌కిరణ్, ఏఈఈలు రమణమూర్తి, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన వైసీపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 19: మిండి కాలనీలోని మునసీబు వీధిలో మంగళవారం పెంకుటిల్లు పైకప్పు కూలడంతో గాయపడిన బాధితులను బుధవారం వైసీపీ నాయకులు గుడివాడ లతీశ్, ఈటి సురేష్, శ్రీనివాసరావులు పరామర్శించారు. బాధిత బాలాజీ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూన్ 19: విద్యుత్ నిర్వహణ పనుల చేపడుతున్నందున గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. నక్కవాని పాలెం 60 అడుగుల రోడ్డు, కేఆర్ఎం కాలనీ, కాకతీయ ఫంక్షన్ హాలు, జయభేరి ప్రాంతం, భావన స్కూల్ ప్రాంతం, సత్యం జంక్షన్ ప్రాంతం, ఏఎంజీ ఆసుపత్రి ప్రాంతం, క్రాంతినగర్, ఆంధ్రాబ్యాంక్, హెచ్‌టీ సర్వీస్, సీతమ్మధార సెయిల్ క్వార్టర్స్, పోస్టు ఆఫీస్ ప్రాంతం, హెచ్‌బీ కాలనీ లాస్ట్ బస్‌స్టాప్ తదితర ప్రాంత వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాంకేతికతతో గంజాయి రవాణాకు అడ్డుకట్ట

» నగర కమిషనర్ రవిశంకర్ అయ్యనార్

మహారాణిపేట, జూన్ 19: గంజాయి సాగు నిర్మూలన, సరిహద్దునున్న ఒడిశానుంచి రవాణా అడ్డుకట్టకు అత్యాధునిక సంకేతికతను వినియోగించనున్నట్టు నగర పోలీసు కమిషనర్ ఏ రవిశంకర్ అయ్యనార్ తెలిపారు. గంజాయి, ఇతర డ్రగ్స్ నివారణకు నివారణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ఇంటర్ డిపార్టుమెంట్ కో ఆర్డినేషన్ సమావేశం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. గంజాయి ప్రాంతాలను తొలుత గుర్తించి దీని రవాణా అడ్డుకట్టకు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఎన్‌డీపీఎస్ నేరస్తుల బ్యాంక్ స్టేట్‌మెంట్లు, నేరస్తుల ఎలక్ట్రానిక్ డివైజస్‌లు విశ్లేషించటానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. గంజాయి మూలాన్ని తెలుసుకుని వేరు చేయటం, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రమేయం కలిగి రిమాండ్‌లో ఉన్న నేరస్తుల ములాఖత్‌లపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. సముద్ర మార్గాలపై ప్రత్యేక నిఘా, స్నేపర్ డాగ్స్ సేవలు, నార్కోటిక్స్‌ను గుర్తించేందుకు డాగ్స్ ప్రత్యేక శిక్షణ. డ్రగ్స్ దుర్వినియోగంపై షార్టు ఫిలిం పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తామన్నారు. ప్రత్యేక టోల్ ఫ్రీ నంబరు 14500 ఏర్పాటుచేసినట్టు చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల వారి బ్యాగులు, లాకర్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు, జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీలు, స్వచ్ఛంద సంస్థలప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవిశంకర్ అయ్యనార్

వైభవంగా రమా సత్యనారాయణస్వామి రథయాత్ర

మహారాణిపేట, జూన్ 19: ఇసుకకొండ శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రథయాత్రను నిర్వహించారు. కొవిడ్ కారణంగా గత ఐదేళ్లనుంచి నిలిచిపోయిన స్వామి వారి రథయాత్ర ఈ ఏడాది మళ్లీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మేళతాళాలు, హరినామ కీర్తనలతో అంగరంగ వైభవంగా ఈ వేడుకను నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అలంకరణలో వెంకటేశ్వర స్వామి


సత్యనారాయణస్వామి విగ్రహం ఊరేగింపు

పోర్టు వెంకటేశ్వరుని కల్యాణం..

మహారాణిపేట: పోర్టు ఏరియాలోని శృంగముని పర్వతంపై వేంచేసిన శ్రీ వెంకటేశ్వర సామి వారి కల్యాణ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునుని వేదికపై అధిష్టంజేసి వేదమంత్రాలు, మంగళవాద్యాల మధ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సు ప్ర భాత సేవలు, హోమాలు నిర్వహించారు. ఈ నెల 21 వ తేదీన స్వామి వారి ఊరేగింపు, సముద్రంలో తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

ఉమా చంద్రమౌళీశ్వరస్వామి పందిరాట

డాబాగార్డెన్స్, జూన్ 19: డాబాగార్డెన్స్‌లోని శ్రీ శివ రామకృష్ణ దేవాలయంలో శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి దివ్య కల్యాణమహోత్సవాలను గురువారంనుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి, జేపీ కె.మన్మథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, కల్యాణం రాట , కంకణధారణ శాస్త్రోక్తంగా నిర్వహించినట్టు చెప్పారు. 20న పుణ్యాహవచనం, దీక్షా వస్త్రధారణ, కంకణధారణ, అంకురారోపణ, సాయంత్రం అగ్ని ప్రదక్షణత్రం ఉంటాయన్నారు. 21న పంచామృత అభిషేకం విశేష అలకారం, సాయంత్రం ఊరేగింపు స్వామివారిని ఉత్సవ విగ్రహాల గ్రామ ప్రదక్షిణ జరుగుతుందన్నారు. సాయంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. భక్తులందరూ పాల్గొని ఈ కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జి.భార్గవశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ రాట వేస్తున్న అర్చకులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి: డీఎంహెచ్‌వో

సీతమ్మధార, జూన్ 19: వర్షాకాలంలో కీటక జనిత (దోమల ద్వారా) మలేరియా, డెంగ్యు చికున్ గున్యా, బోదకాలు తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో ఎ.జగదీశ్వరరావు తెలిపారు. తన కార్యాలయంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసి రాజ్ మాట్లాడుతూ ముఖ్యంగా దోమలు వ్యాప్తి అరికట్టాలన్నారు. పరిసరాల పరిశు భ్రతపై జనాలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా మీడియా అధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ సమత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డిఐఒ బి.నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది నాగభూషణ్, ఎంపీహెచ్‌ఈవో పాల్గొన్నారు.

సికిల్ ఎనిమియా వ్యాధి నిర్మూలనే ధ్యేయం

సీతమ్మధార: కేంద్ర పభుత్వం 2047 నాటికి సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలన మిషన్ ప్రకటించినట్టు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. సికిల్ సెల్ ఎనిమియాడే సందర్భంగా మారికవలస బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజన ప్రాంతాలలో 40 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ అవగాహన కల్పించడం, సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం అధికారులు డా.బి.ఉమావతి, నోడల్ అధికారి అఖిల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.విశ్వనాథ్, హాస్టల్ వార్డెన్, మధురవాడ మెడికల్ అధికారి డా.ప్రశాంతి, మారికవలస మెడికల్ అధికారి డా.చైతన్య, సిబ్బంది, నాగభూషణం, ఎంపీహెచ్‌ఈఓ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ

అక్కయ్యపాలెం, జూన్ 19: మత్తు పదార్థాల రహిత నగరంగా విశాఖను తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్క రూ ముందుకు రావాలని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.లక్ష్మీనరస, పీడీ ఎ.సునంద్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మారక ద్రవ్యాలకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా ఫోన్: 14500 తెలియజేయాలని కోరారు. అనంతరం 80 అడుగుల రోడ్డు మహారాణి పార్లర్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రమిల, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ, చక్కగా చదువుకోవాలని ఎయిర్‌పోర్ట్ సీఐ వి.చక్రధరరావు అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనా చర్యల్లో భాగంగా బుధవారం పోలీసులు ఎన్ఏడీ ప్రాంతంలో ఉన్న పలు కళాశాల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు స్నేహాలు చేసి తప్పుడు మార్గాన్ని అనుసరించవద్దన్నారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

చెత్తను తొలగించారు..

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సీతమ్మధార, జూన్ 19: గ్రేటర్ 23వ వార్డు చైతన్యనగర్, మద్దిలపాలెం రోడ్డులో ఉన్న చెత్త కుప్పలు, వ్యర్థాలను జీవీఎంసీ అధికారుల ఆదేశాలతో బుధవారం సిబ్బంది తొలగించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 19న 'చెత్తను తొలగించేదెన్నడో..?' శీర్షికన ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వారి ఆదేశాలపై సిబ్బంది చెత్త ను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.


మద్దిలపలెం రోడ్డుపై చెత్త తొలగించిన దృశ్యం

రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గోపాలపట్నం, జూన్ 19: కొత్తవలస సమీపంలోని దేశపాత్రునిపాలేనికి చెందిన ఇల్లపు వినయ్ (28)కు మతిస్థిమితం లేకపోవడంతో తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోతాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంతానికి వచ్చిన వినయ్ ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతుని వద్ద లభించిన ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యన్నపై అభిమానం...
అప్పన్నపై భక్తితో పాదయాత్ర


సింహాచలం వచ్చిన నాతవరం టీడీపీ అభిమానులు

సింహాచలం, జూన్ 19: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం వరాహలక్ష్మీనృసింహస్వామిపై అచంచల భక్తి, తమ నాయకుడు అయ్యన్నపాత్రుడిపై వల్లమాలిన అభిమానంతో నాతవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు సింహగిరికి పాదయాత్రగా చేరుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన వీరాభిమానులు సుమారు 30 మంది ఈనెల 17న ఉదయం తమ గ్రామం నుంచి పాదయాత్రగా బుధవారం సాయంత్రం సింహగిరికి చేరుకున్నారు. వారంతా వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమ స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు.

పల్లా శ్రీనివాసరావుకు అభినందనల వెల్లువ


పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

మహారాణిపేట, జూన్ 19: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బొట్ట పరదేశీయాదవ్, చింతపల్లి చినపోలరాజు, ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్‌గౌస్, వైస్ ప్రెసి డెంట్ షేక్ ఖాలీషా, నమ్మి రవికుమార్ తదితరులు పా ల్గొన్నారు.

అక్కయ్యపాలెం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి, 44వ వార్డు ఇన్‌చార్జి కొయిలాడ వెంకటేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు సారథ్యంలో రా ష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని విశాఖ పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్ష, కార్యదర్శులు మొల్లేటి కుమారస్వామి, దువ్వి కాశీప్రసాద్ అన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబా బు, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని కలిసిన వారిలో నాయకులు వరడా సంతోష్‌కుమార్, ఎస్.పుల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆనందపురంలో మట్టి దందా

... 3వ పేజీ తరువాయి

తవ్వకాలు/విక్రయాలకు పంచాయతీలో కొందరి దన్ను ఉందనే ఆరోపణలు ఉన్నాయి. మట్టి తవ్వకాలపై బుధవారం కొందరు గ్రామస్థులు పంచాయతీ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరు స్పందించలేదు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసులకు ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో డయల్ యువర్ 100కి ఫోన్ చేస్తే కానిస్టేబుళ్లు వచ్చారు. అప్పటికే స్థానికులు అభ్యంతరం చెప్పడంతో లారీలు, ఎస్కవేటర్లను తవ్వకందారులు అక్కడ నుంచి తీసుకుపోయారు. ఇదేవిధంగా గత ఐదేళ్లలో మండలంలోని గిడిజాల, ఆనందపురం, దువ్వివానిపాలెం, గండిగుండం, మామిడిలోవ, రామవరం, తదితర గ్రామాల్లో కొండవాలు ప్రాంతాల్లో లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వేశారు. గనుల శాఖ, రెవెన్యూ శాఖ తూతూమంత్రంగా దాడులు చేసి కేసులు నమోదు చేశారు తప్ప అక్రమ తవ్వకాలను అడ్డుకోలేకపోయారు. ప్రభుత్వం మారినందున ఇప్పటికైనా అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

పవన్ కల్యాణ్‌కు
అటవీశాఖ అధికారుల సంఘం అభినందన

విశాఖపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను బుధవారం అమరావతిలో రాష్ట్ర అటవీశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు జి. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు, జాయింట్ సెక్రటరీ శర్మ, సభ్యులు సోమసుందరం, అప్పన్న మర్యాదపూర్వకంగా కలిశారు. అటవీ, పర్యావరణ శాఖకు పవన్‌కల్యాణ్ మంత్రి కావడంతో లక్కీ ప్లాంట్‌ను బహూకరించారు.


లక్కీప్లాంట్ అందిస్తున్న లక్ష్మణ్

పవన్‌ను కలిసిన జనసేన నేత సాధిక్

జగదాంబ కూడలి: రాష్ట్ర డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్‌ను జనసేన ఉత్తరాంధ్ర జిల్లా కో-కన్వీనర్, జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ సాదిక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అటకెక్కిన గస్తీ, భయం నీడన బస్తీ!!

... 3వ పేజీ తరువాయి

నిర్లక్ష్యం వహించారు. దీంతో ప్రస్తుతం సగం బీట్‌లు కూడా నడవని పరిస్థితి నెలకొంది. అంతేగాకుండా బీట్ సిబ్బంది తూతూమంత్రంగా తమకు కేటాయించిన రూట్‌లో పహారా కాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి పది గంటలకు పోలీస్ స్టేషన్ నుంచి బీట్ బుక్ తీసుకుని బయలుదేరుతున్నారు. ఒక గంటసేపు బీట్ రూట్‌లో తిరిగిన తర్వాత కొందరు సినిమా థియేటర్లకు వెళ్లి కాలక్షేపం చేస్తే, మరికొందరు ఏకంగా ఇళ్లకు వెళ్లి నిద్రపోతున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు తిరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బీట్ బుక్‌ను అప్పగించి డ్యూటీ దిగిపోతున్నారు. దీనివల్ల రాత్రి పూట నగరంలో పోలీసుల గస్తీ నామమాత్రంగా మారింది. ఇదే అదనుగా ఆకతాయిలు, నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం నేరం జరగడానికి గల కారణం ఏమిటనే దానిపై పరిశోధన చేయకపోవడం, కారణం తెలిసినా పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు.

ఒంటరిగా కనిపిస్తే అంతే సంగతి

పోలీసుల గస్తీ కొరవడడంతో నగరంలో రాత్రి పదకొండు గంటల దాటిన తర్వాత ఒంటరిగా నడిచి వెళ్లాలన్నా, బైక్‌పై వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారిపైనా, పాతజైలురోడ్డు, సీతమ్మధార, రైల్వేన్యూకాలనీ, శివాజీపాలెం, రామాటాకీస్ పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు గుంపులుగా రోడ్లపై చేరుతున్నారు. బైక్‌లతో చీకటిగా ఉండే ప్రాంతాల్లో మాటువేసి ఒంటరిగా నడిచి వచ్చేవారిని, బైక్‌పై వచ్చే వారిని వెంబడించి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఎవరైనా ప్రతిఘటిస్తే వారిపై మూకుమ్మడిగా దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నెల రోజులు కిందట పాతజైలురోడ్డు వద్ద రాత్రి 11 గంటల సమయంలో ఒక మహిళపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి పరారైపోయారు. తాజాగా అదేచోట మంగళవారం రాత్రి పది గంటల సమయంలో వాకింగ్ చేస్తున్న వ్యక్తిపై ఇద్దరు యువకులు దాడి చేశారు. అక్కడకు కూతవేటు దూరంలోనే రామ్‌నగర్ బజార్ వద్ద 17వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో నడిచి వెళుతున్న మహిళ చేతిలోని బ్యాగ్‌ను తెంచుకుపోయారు. ఈనెల 13న జాతీయ రహదారిపై పోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో (ఈటర్స్ స్టాప్ వద్ద) ఒక ప్రైవేటు ఉద్యోగిపై బైక్ వచ్చిన ముగ్గురు దాడికి యత్నించారు. ఆయన కేకలు వేయడంతో పరారయ్యారు. అలాగే మూడు నెలల కిందట తాటిచెట్లపాలెం ప్రాంతంలో ప్రైవేటు ఉద్యోగిపై దాడి చేసి అతని సెల్‌ఫోన్‌తో పాటు జేబులోని డబ్బులు లాక్కొన్నారు. ఇలాంటి ఘటనలు చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి.

పనిచేయని వీధి దీపాలు

జాతీయ రహదారితోపాటు వీధుల్లో ఉన్న దీపాల్లో దాదాపు సగం వరకూ పనిచేయడం లేదు. దీంతో రాత్రిపూట ఆయా ప్రాంతాలన్నీ చీకటిమయంగా మారిపోతున్నాయి. అదేవిధంగా రోడ్లకు ఇరువైపులా చెట్లు గుబురుగా ఉన్నచోట్ల కూడా చీకటిగానే ఉంటోంది. ఆకతాయిలు, నేరగాళ్లు...అటువంటి ప్రాంతాల్లోనే దోపిడీలకు పాల్పడుతున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినాసరే నగరంలోని సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరస్థులను గుర్తించలేకపోతున్నారు. నగరంలో 1700 సీసీ కెమెరాలు ఉంటే, వాటిలో కేవలం 700 మాత్రమే పనిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి ఉంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎలా సాధ్యమవుతుందని తాను నగర పోలీస్ కమిషనర్‌ను నేరుగా ప్రశ్నించానని, త్వరలోనే వాటికి మరమ్మతులు చేయిస్తామని చెప్పారని రాష్ట్ర హోం మంత్రే వెల్లడించారు.

ఆస్తి పన్ను చెల్లింపునకు తంటాలు

... 3వ పేజీ తరువాయి

సీడీఎంఏ వెబ్‌సైట్ ద్వారా పన్ను వసూలు జరుగుతుంది. గత మూడు రోజులుగా సీడీఎంఏ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో వార్డు సచివాలయాల్లో ఆస్తిపన్ను వసూళ్లు నిలిచిపోయాయి. పన్ను చెల్లింపుదారులు అక్కడకు వెళితే సర్వర్ డౌన్‌లో ఉన్నందున పన్ను కట్టించుకునే పరిస్థితి లేదని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. దీంతో వారంతా వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఈ నెలాఖరులోగా చెల్లించకపోతే వడ్డీ పడిపోతుందని, అది ఎవరు భరిస్తారని కొందరు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రోగుల ఆరోగ్యంతో చెలగాటం

... 3వ పేజీ తరువాయి

ఇవ్వాలో లెక్కలు ఉన్నాయి. వాటిని పాటించే దిక్కే లేదు. మధ్యాహ్న భోజనం కింద అన్నం, సాంబారు, పప్పు, కూర, మజ్జిగ, అరటిపండు, గుడ్డు ఇవ్వాలి. రాత్రికి మజ్జిగ, అరటిపండు తీసేసి మిగిలినవన్నీ ఇవ్వాలి. ఎవరైనా రోగులు పుల్కాలు, రోటీ అడిగితే పెట్టాలి. మూడు పూటలూ గుడ్డు అందించాలి. ఈ భోజనంలో కూరలు, పప్పు గురించి చెప్పనక్కర్లేదు. రుచి అంతంతమాత్రమే. ఆ ఆహారం రోగులకు సాయంగా ఉండేవారు తిని, బయట నుంచి మంచి ఆహారం తీసుకువచ్చి రోగులకు పెడుతున్నారు. ఈ విషయాలన్నీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

వారం నుంచి ఉప్మాయే

మా అమ్మాయికి ఆరోగ్యం బాగా లేదని వారం క్రితం తీసుకువచ్చి చేర్పించాం. గైనిక్ వార్డులో చికిత్స చేస్తున్నారు. వారం నుంచి టిఫిన్ కింద రోజూ జావలాంటి ఉప్మా ఇస్తున్నారు. గట్టిగా అడిగితే పంపించేస్తారని ఏమీ అనలేకపోతున్నాం.

- మధు, సీతంపేట

చేతికి అంటుకుంటోంది



డెలివరీ కోసం వచ్చాము. గైనిక్ వార్డులో ఉంటున్నాం. రోజూ ఈ ఉప్మా ఇస్తున్నారు. ప్లేటులో వేయగానే మొత్తం పరుచుకుపోతోంది. చేతితో తినలేకపోతున్నాం. చెంచాతో తినాలని అనుకుంటే జారి కింద పడిపోతోంది. భోజనం కూడా రుచిగా ఉండడం లేదు.

- బి.రాణి, శాలిపేట

పెందుర్తిలో ప్రభుత్వ స్థలం కబ్జా

... 3వ పేజీ తరువాయి

రాస్తాగా మారిన సర్వే నంబర్ 117లోని 22 సెంట్ల ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూమిపై పలువురి కళ్లు పడ్డాయి. అంతా కలిసి ఈ భూమిని కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. తమకు గతంలో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరుచేసిందని పేర్కొంటూ ఆ జాగాలో పాగా వేశారు. కొంతకాలం తరువాత ఆ స్థలాలు చేతులు మారాయి. ఇప్పుడు వాటిల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయమై ఫిర్యాదు రావడంతో రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టగా ఇళ్ల పట్టాలు నకిలీవిగా తేల్చారు. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్టు తమ విచారణలో తేలినట్టు సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

టిడ్కో ఇళ్లకు గ్రహణం వీడేనా?

- నమ్మివానిపేటలో నిరుపయోగంగా గృహ సముదాయం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు



నమ్మివానిపేట వద్ద టిడ్కో ఇళ్ల సముదాయం

తగరపువలస, జూన్ 19: గత కొన్నేళ్లుగా నమ్మివానిపేట సమీపంలో నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను వృథాగా వదిలేయడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిని తమకు కేటాయించాలని లబ్ధిదారులు గగ్గోలుపెడుతున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిని తమకు కేటాయిస్తారనే ఆశలు లబ్ధిదారుల్లో చిగురిస్తున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణాలను చేపట్టారు. ఇవి పూర్తయ్యే సమయంలో ప్రభుత్వం మారిపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇందులో ఇళ్లను పొందడానికి చాలామంది లబ్ధిదారులు డీడీల ద్వారా డిపాజిట్లు చెల్లించారు. ఈ విధంగా చెల్లించిన వారికి ఇళ్లను కేటాయించినట్లయితే, ఇప్పటికే ఈ ప్రాంతమంతా ప్రత్యేక టౌన్‌షిప్‌గా కళకళలాడేది. కానీ ఈ ఇళ్లను ఎవరికీ కేటాయించకపోవడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

ఎంపిక చేసిన ఈ ప్రాంతం జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో ఉండడం వల్ల సంగివలస జాతీయ రహదారికి, మరోవైపు భీమిలి, విశాఖ వెళ్లే దొరతోట రహదారికి అనుసంధానంగా నిలవడంతో ఈ కాలనీ ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశించారు. అనుకున్న విధంగా నిర్మాణాలు జరగకపోవడం, పూర్తయిన ఇళ్లను కేటాయించకపోవడంతో ఇబ్బందులు తెలెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ లబ్ధిదారులలో చాలామందికి జగనన్న ఇళ్ల కాలనీలో స్థలాలు కేటాయించారు. వారికి ఈ టిడ్కో ఇళ్లు ఇస్తారా.. లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డిపాజిట్లు చెల్లించినవారిలో పలువురు చనిపోయారు. కొంతమంది ఇతర ప్రాంతాలకు వలసపోయారు. తగరపువలసకు చెందిన పల్లా రామయ్యమ్మ చనిపోయింది. ఆమె కుటుంబ సభ్యులకు డిపాజిట్ తిరిగి చెల్లించడమా లేదా.. ఇల్లు కేటాయించాల్సి ఉంది. ఇలాంటి సమస్యలు పలువురు లబ్ధిదారులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది తమకు ఇల్లు వద్దు డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లించాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఏ నిర్ణయం తీసుకోలేదు. అదే విధంగా లబ్ధిదారులు పోతుల మురళీధర్, కానూరి జగదీశ్వరరావు ఐదేళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. చాలామంది రూ.లక్ష మేర డిపాజిట్ చెల్లించారు. ఆరేళ్లకు పైగా కావడంతో ఈ సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని, లేదా ఇల్లైనా కేటాయించాలని కోరుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఈ ఇళ్లపై సమీక్ష జరిపి అనర్హుల డిపాజిట్లు తిరిగి చెల్లించి, మిగిలిన ఇళ్లను అర్హులైనలబ్ధిదారులకు కేటాయించాలని కోరుతున్నారు. ఈ ఇళ్లు వినియోగంలోకి వస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధించడానికి వీలవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఓటమిపై జగన్ ఆత్మావలోకనం చేసుకోవాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమునిపట్నం, జూన్ 19: ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయాయో జగన్ ఆత్మావలోకనం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సూచించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రామతీర్థాలు దేవస్థానంలో శ్రీరాముని విగ్రహం శిరస్సు తెగిపడడం, కనకదుర్గమ్మ గుడిలో నగలు మాయం, అంతర్వేదిలో కాలిపోయిన రథం వంటి ఘటనలను పరిశీలిస్తే నిజం బోధపడుతుందన్నారు. మాస్కులు కావాలని అడిగిన డాక్టర్ సుధాకర్‌ను వేధింపులకు గురిచేయడం, కల్తీ మద్యం తాగి చనిపోయిన కుటుంబాల ఉసురు తగిలిందనే వాస్తవం అర్థమవుతుందన్నారు. అన్నక్యాంటీన్‌ల మూసివేతతో పేదల నోటివద్ద కూడు తీసేసిన రాక్షసత్వానికి వైసీపీ సమాధి అయిందన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

సింహాచలం, జూన్ 19: కుష్ఠు రోగులకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని అడివివరం మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నేత పాశర్ల ప్రసాద్ అన్నారు. రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని వ్యాలీ ఆఫ్ లవ్(లెప్రసీ కాలనీ)లో రోగులకు బుధవారం ఆయన పండ్లను పంపిణీ చేశారు. భవిష్యత్‌లో ఎటువంటి సమస్య ఎదురైన కాంగ్రెస్‌పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భోగాపురపు పైడిరాజు, లండ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాలిక చికిత్సకు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న ట్రస్టు నిర్వాహకులు

విశాలాక్షినగర్, జూన్ 19: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జోడుగుళ్లపాలెంలోని బాలిక డి.భార్గవి చికిత్సకు నగరానికి చెందిన రాచకొండ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రాచకొండ దశరథరామయ్య దంపతులు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇటీవల భార్గవి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించింది. అకస్మాతుగా అనారోగ్యానికి గురైంది. చికిత్స అందించడం తల్లిదండ్రులకు భారంగా మారడంతో వారికి రూ.1,11,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ మధుసూదనరావు, స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ప్రగడవాసు, జోడుగుళ్లపాలెం గ్రామకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాప్ నిర్వాహకుల పేరుతో బురిడీ

గోపాలపట్నం, జూన్ 19: కోసం ర్యాపిడో వాహనాన్ని బుక్ చేసిన మహిళను యాప్ నిర్వాహకుల పేరిట బురిడీ కొట్టించి ఆమె అకౌంట్‌లోని నగదును ఆన్‌లైన్ మోసగాళ్లు కాజేశారు బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 89వ వార్డు పరిధి ఎల్లపువానిపాలేనికి చెందిన ఆర్.సుమ షీలానగర్‌లోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆమె ర్యాపిడో యాప్ ద్వారా వాహనాన్ని బుక్ చేశారు. యాప్ పనిచేయడం లేదని సెల్ ఫోన్‌కు మెసేజ్ రావడంతో కస్టమర్ కేర్‌తో మాట్లాడారు. అక్కడి నుంచి వచ్చిన సందేశానుసారం వివరాలను పంపి సుమ రూ.2 జమ చేశారు. వెంటనే ఆమె బ్యాంకు అకౌంట్ నుంచి రూ.19,958, తర్వాత రూ.2,542 నగదు డ్రా చేశారు. దీంతో మోసానికి గురైనట్టు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూన్ 19: వరాహలక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సహస్రనామ తులసీ దళార్చన, నిత్యకల్యాణాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి పవిత్ర తులసీదళాలతో అర్చన అనంతరం ఉదయం 9.30గంటలకు అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణాన్ని జరిపి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన భక్తులకు ప్రసాదాలు అందజేశారు

ఎక్సైజ్ ఉద్యోగులకు న్యాయం చేయండి



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు వినతి పత్రం ఇస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఎంవీపీకాలనీ, జూన్ 19: ఎక్సైజ్ శాఖలో సెబ్ ఏర్పాటుచేయడంతో ఇబ్బందులు పడుతున్నామని విశాఖపట్నం ఎక్సైజ్ కానిస్టేబుల్స్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు మొర పెట్టుకుంది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. తమను ఏకీకృతం చేసి, న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అప్పలనారాయణ, జగన్నాథం, వీరభద్రం, మధు, శివ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినోత్సవం

భీమునిపట్నం, జూన్ 19: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం భీమిలి బ్యాంక్ కాలనీలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అద్దాల వెంకట వర్మరాజు కార్యాలయంలో జరిపారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గాదం మహేష్, ఏపీ వర్మరాజు, గౌతమ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

22న నుంచి భజగోవింద ప్రవచనాలు

సిరిపురం, జూన్ 19: నిష్కామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 25 వరకు ఏయూ డా.వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శ్రీ శంకరాచార్యుల విరచిత భజగోవిందపై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంస్థ కోశాధికారి కె.భారతి తెలిపారు. ఈ మేరకు సిరిపురం వాల్తేర్ అప్‌ల్యాండ్స్‌లో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి రోజూ సాయంత్రం 5.30నుంచి 6 వరకు భజనలు, 6 నుంచి 7.15 వరకు ప్రవచనాలు జరుగుతాయన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అరుణజీ భజగోవిందం 31 శ్లోకాల్లోని 31 సూక్తులు, జీవన విధానాలను ప్రవచనాల్లో తెలుపుతారన్నారు. శంకరాచార్యులు ప్రబోధాల ద్వారా నిత్య జీవితంలో ఏర్పరచుకున్న మోహాల నుంచి విముక్తి చెందే మార్గాలను చూపారన్నారు. సంస్థ ప్రతినిధి ఎం.అనూరాధ మాట్లాడుతూ ప్రజలు ప్రవచనాల ప్రాశస్త్యాన్ని తెలుసుకోవాలన్నారు. మరో ప్రతినిధి ఎస్.శాంతిప్రియ మాట్లాడుతూ మనిషిలో మంచి పరివర్తనకు ఉపకరించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సింహాచలం, జూన్ 19: వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి, అడివివరం పైడితల్లమ్మ వార్షిక మహోత్సవంలో భాగంగా ప్రధాన పార్టీలు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. టీడీపీ తరపున గ్రేటర్ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, పార్టీ అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్ సారథ్యంలో టాలీవుడ్ నేపథ్యగాయని సాహితీ, షణ్ముఖ ఆలపించిన పలు సినీగీతాలకు కీరవాణి ఆర్కెస్ట్రా శోభ చేకూర్చాయి. కీడాపోటీల్లో గెలుపొందిన జట్టుకు విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ నేత గండి బాబ్జీ ట్రోఫీని, బహుమతి చెక్‌ను అందజేశారు. జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు మజ్జి సూరిబాబు, మజ్జి శ్రీనివాస్ నేతృత్వంలో డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ అలరించాయి. వాలీబాల్ పోటీల విజేతలకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు బహుమతులు అందజేశారు. వైసీపీ తరపున కర్రి అప్పలస్వామి, కర్రి సత్తిబాబు ఏర్పాటు చేసిన లౌలీ లుక్స్ గ్రూప్ యువత ప్రత్యేక సెట్టింగ్స్‌తో చేసిన నృత్యాలు ప్రేక్షకులను మైమరిపించాయి. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు సారథ్యంలో ఏర్పాటు చేసిన రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా శ్రోతలకు వీనుల విందు కలిగించింది.

ఎమ్మెల్యే గంటాకు శుభాకాంక్షల వెల్లువ



గంటాకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీడీవో, సిబ్బంది



గంటాను సత్కరిస్తున్న పోతిన శివ తదితరులు

భీమునిపట్నం, జూన్ 19: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును బుధవారం ఎంవీపీలోని ఆయన నివాసంలో ఎంపీడీవో డాక్టర్ వి.జానకి, ఈవోపీఆర్డీ జి.అప్పలరాజు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో జరగనున్న మండల సర్వసభ్య సమావేశానికి గౌరవఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. మండల విద్యాశాఖాధికారులు శివరాణి, జయప్రద పాల్గొన్నారు.

కొమ్మాది: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆరో వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాతృశ్రీ ట్రస్టు చైర్మన్, మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతిన శివ బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా గంటాను అభినందించి, వార్డులో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మాతృశ్రీ బిల్డర్స్ పోతిన వెంకటరామారావు అనుచరులతో కలిసి గంటాను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌కు చర్యలు



ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఈ

సింహాచలం, జూన్ 19: అప్పన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా కొత్తఫీడర్‌ను ప్రారంభిస్తున్నట్టు ట్రాన్స్‌కో పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ పేర్కొన్నారు. మహా విశాఖ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెం 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఓవర్‌లోడ్ సమస్యను అధిగమించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన నూతన ఫీడర్‌ను బుధవారం ఆయన స్విచ్‌ఆన్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈ పి.శ్రీనివాసరావు, డీఈఈ ఆర్.రామునాయుడు, ఏఈ డీవీఎల్ కుమార్ పాల్గొన్నారు.

జమ్మిచెరువు పార్కులో మొక్కలు నాటిన వాకర్స్



భీమిలిలో మొక్క నాటుతున్న వాకర్స్



జూ పార్కులో మొక్కలు నాటుతున్న దృశ్యం

భీమునిపట్నం, జూన్ 19: స్థానిక జమ్మిచెరువు పార్కులో బుధవారం జేసీపీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వీటి సంరక్షణపై శ్రద్ధ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మీసాల బుచ్చిబాబు, కదిరి జగన్నాథం, గాడు సన్యాసినాయుడు, నెయిగాపుల జనార్ధనరావు, బట్టా ఈశ్వరరావు, దత్తి ఈశ్వరరావు, గుడ్ల సత్యనారాయణ, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ: సహజ సౌందర్యంతో కూడిన మొక్కలు సీతాకోక చిలుకలకు మకరందాన్ని అందించి, జీవ వైవిధ్యాన్ని పెంపొందించేందుకు ఉపకరిస్తాయని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. లైఫ్ మిషన్ వార్షిక కార్యక్రమంలో భాగంగా జూ పార్కు సీతాకోక చిలుకల పార్కు వద్ద వివిధ రకాల పూలమొక్కలను నాటారు. ఈ మొక్కలు పర్యావరణాన్ని పెంపొందిస్తాయన్నారు. సీతాకోకచిలుకలు పర పరాగ సంపర్కానికి అనువుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జూ ఏసీఎఫ్ మంగమ్మ అసిస్టెంట్ క్యూరేటర్ గోపి, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు భారతి, తదితరులు పాల్గొన్నారు.

'పార్కుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి'



పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్

ఆరిలోవ, జూన్ 19: నగర ప్రజల ఆహ్లాదం కోసం చేపట్టిన పార్కుల ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జోన్ 2 పరిధి ముడసర్లోవ చిల్డ్రన్ పార్కు, ఐటి సెజ్ సమీప తారకరామనగర్ లేఅవుట్‌వద్ద ఐటీ పార్కు, టెన్నిస్ కోర్టు పార్కుల పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముడసర్లోవ పాత నర్సరీలో నిర్మిస్తున్న చిల్డ్రన్ పార్కు పనులను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. చిల్డ్రన్‌పార్కు వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా ఉన్న చెట్లకు నష్టం వాటిల్లకుండా మరో చోటుకు మార్పుచేయాలని, పార్కుని పూర్తిగా పిల్లల కోసమే నిర్మిస్తుండడంతో వారి ఉల్లాసానికి, ఆనందానికి అనుగుణంగా పర్యావరణ హిత పరికరాలతో తీర్చిదిద్దాలన్నారు. మరుగుదొడ్లను నిర్మించాలని పర్యవేక్షణ ఇంజనీర్ శాంసన్‌రాజును ఆదేశించారు. డంపింగ్‌యార్డు వెనుక నర్సరీని పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అనంతరం ఐటీ పార్కు, టన్నిస్ కోర్టు పనులను పరిశీలించి వేగవంతగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కమిషన్ వెంట జోనల్ కమిషనర్ శైలజావల్లి, కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతి రాజు, అసిస్టెంట్ మెడికల్ అధికారి కిశోర్ ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ వంశీ, సహాయక ఇంజనీర్ శ్రీధర్ తదితరులున్నారు.

వెల్ఫేర్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా



వెల్ఫేర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

సిరిపురం, జూన్ 19: వెల్ఫేర్ సంస్థలో డబ్బులు కట్టిన పాపానికి ఏడేళ్లుగా సంస్థ చైర్మన్‌తో పాటు ప్రతినిధులు తిప్పుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆశీలమెట్టలోని మేఘలయా ఎదురుగా ఉన్న వెల్ఫేర్ కార్యాలయం వద్ద బాధితులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని గుడివాడ, కడప, చీరాల, తెనాలి, మదనపల్లి, ధర్మవరంతో పాటు అనేక ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చామన్నారు. ప్రతి నెలా వచ్చి వెళ్లడం తప్ప తాము కట్టిన డబ్బులకు న్యాయం జరగడం లేదన్నారు. కనీసం సంస్థ ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. పాలసీలు కట్టిన తమకు కొంత మేర చెల్లించారని, అసలు సొమ్ము చెల్లిస్తామని మాటలే తప్ప చెల్లింపుల్లేవన్నారు. అసలు ఇస్తామని, వడ్డీ ఇవ్వలేమని చెబుతున్నారన్నారు. మూడు, ఐదు సంవత్సరాల పద్ధతిలో డబ్బు చెల్లించామన్నారు. తక్షణమే సంస్థ ఎండీ, డైరెక్టర్లు స్పందించి చెల్లించిన డబ్బులకు అసలు, వడ్డీ కలిపి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి న్యాయం చేయాలని కోరారు.

సందడిగా 'నేను బడికి పోతా' కార్యక్రమం

ఆరిలోవ, జూన్19: 'నేను బడికి పోతా' కార్యక్రమం బుధవారం వివిధ పాఠశాలల్లో సందడిగా జరిగింది. ఈ సందర్భంగా తోటగరువు ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని తల్లికి వందనం పథకంలో భాగంగా పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. చిన్నారులకు స్కూలు బ్యాగ్‌లు, పుస్తకాలను అందించారు. 'నేను బడికి పోతా' బ్యానర్‌ను ఆవిష్కరించారు. ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి చక్కగా చదువుకోవాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామకలక్ష్మి రాజశేఖర్, నేతలు ఒమ్మి సన్యాసిరావు, గాడు అప్పలనాయడు, పాఠశాల హెచ్ఎం వి.విశ్వనాథం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొమ్మాది: ప్రజాధనం దుర్వినియోగం కాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు జగన్ ఫొటోలతో ఉన్నా పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీచేయాలని ఆదేశించారని టీడీపీ నేత గొలగాని సన్యాసిరావు అన్నారు. బుధవారం కొమ్మాది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్ట్‌లను పంపిణీ చేశారు. గుంటబోయిన సంజీవ్, బొట్టా అప్పలరాజు, సియాద్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: మంగమారిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం స్టూడెంట్ కిట్స్‌ను టీడీపీ వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు అందజేశారు కార్యక్రమంలో గరికిన ఎల్లయ్య(కింగ్), వాసుపల్లి ఎల్లయ్య, సూరాడ నరసింగరావు, వాసుపల్లి మారాజు, దౌలపల్లి ఎల్లారావు, చెవ్వాకుల కన్నయ్య, దూడ రమేష్, సూరాడ అమర్, సూరాడ తాతాజీ, వాసుపల్లి రవి, జనసేన నాయకులు కనకల దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక బంగ్లామెట్టలో బుధవారం నేను బడికిపోతా.. ప్రత్యేక కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేలా ఇంటింటి ప్రచారం చేపట్టారు. చిన్నారులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులు, టైలు తదితర కిట్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సూరిబాబు, పైడిరాజు, నానిబాబు, హెచ్ఎం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసినట్టు ఎంఈవో -2 గంగరాజు తెలిపారు. గ్రామాల్లో 6 నుంచి 14 ఏళ్ల వయసున్న బాల, బాలికలను అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్స్, సీఆర్‌పీలు, పీటీఏల భాగస్వామ్యంతో జూలై 12వతేదీ లోగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయడు, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధురవాడ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ సూచించారు. స్వతంత్రనగర్ కాలనీ యూపీ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆమె పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బెల్టులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు, టీడీపీ నాయకులు అచ్యుతరావు, నాయుడు, సోంపాత్రుడు, బుజ్జి, భవానీ, రాజు తదితరులు పాల్గొన్నారు.



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి



కొమ్మాదిలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న గొలగాని



భీమిలిలో స్టూడెంట్ కిట్లు అందిస్తున్న టీడీపీ నేతలు

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 58, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 52, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 30, దొండకాయలు 42, బంగాళదుంపలు 31, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 160, బరబాటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్యాప్సికమ్ 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	-- 125
ఫారం ధర	-- 145
విత్ స్కిన్	-- 260
స్కిన్‌లెస్	-- 270

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10 లో..